క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరికలు



శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మామిడి అశోక్, ఎమ్మార్పీఎస్ మండల వికలాంగుల శాఖ అధ్యక్షుడు మామిడి కుమారస్వామి సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

22 లీటర్ల గుడుంబా పట్టివేత

శాయంపేట : మండలంలోని సూర్యానాయక్ తండా గ్రామంలో 22 లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సూర్యానాయక్‌తండా గ్రామంలో సోమవారం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన అజ్మీరా రాజు తన ఇంటి వద్ద గుడుంబా విక్రయిస్తున్నాడనే సమాచారం వచ్చిందన్నారు. దీంతో దాడులు నిర్వహించగా 22 లీటర్ల గుడుంబా లభించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకుని రాజు ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన బరిగెల కోడి కుమారస్వామి, బెజ్జం అనసూయ, బరిగెల పురుషోత్తం ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమారస్వామి, సునీల్, భాస్కర్ పాల్గొన్నారు.

కటాక్షపూర్ మత్తడి వద్ద ట్రాఫిక్‌జామ్

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడి జాతీయ రహదారి 163పై సోమవారం సాయంత్రం ట్రాఫిక్‌జామ్ అవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గంటపాటు వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు పరిస్థితిని అదుపు చేశబూరు. లారీలు ఈ మార్గంలో ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో ట్రాఫిక్‌జామ్ అవుతుందని వాహనదారులు చెబుతున్నారు.

ఇసుక రవాణాతో ఇబ్బందులు

ఐనవోలు : వేలాపాలా లేకుండా ట్రాక్టర్లతో ఇసుక (ఫిల్టరింగ్) కడగడంతో పాటు రవాణా చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలోని వడ్డెరగూడెం సమీపంలోని బండపైన కొంతకాలంగా కొంతమంది ట్రాక్టర్లలో తెచ్చే మట్టిని ఫిల్టర్ చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గ్రామంలోని వడ్డెరకాలనీకి చెందిన వ్యక్తి ట్రాక్టర్‌ను అడ్డుపెట్టి ఫిల్టరింగ్ చేసుకునేందుకు వచ్చిన ట్రాక్టర్ యజమానులతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. కాగా రోడ్డు దెబ్బతినడంతో పాటు తెల్లవారుజాము 4 గంటల నుంచి ఇసుక ట్రాక్టర్లు చప్పుడుతో ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం సరికాదని, దృష్టిసారించాలని కోరుతున్నారు. అయితే ట్రాక్టర్‌ను అడ్డుపెట్టిన వ్యక్తికి స్వల్పగాయాలైనట్లు సమాచారం.

ఉత్తమఉపాధ్యాయులకు సన్మానం



వేలేరు : మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అవడం హర్షణీయమని ఎంఈఓ చంద్రమౌళి అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. మండలంలోని 17 మంది ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక అవడం మండలానికి గర్వకారణమని అన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన ఆకునూరి రవిపాల్ కూతురు ఆకునూరి రవీనా మెడిసిన్ విభాగంలో ఆదిలాబాద్ జిల్లాలోని రిమ్స్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. దీంతో సోమవారం మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన సంఘం పెద్దలు తుడుం సంధ్యారాణి, తుడుం వెంకటేశ్ రవీనాను సన్మానించారు.

ప్రమాదకరంగా మలుపులు

- కానరాని సూచిక బోర్డులు, రేడియం
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



కామారం-పెంచికలపేట రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మలుపు

ఆత్మకూరు : మండలంలోని కామారం గ్రామం నుంచి పెంచికలపేటకు వెళ్లే అంతర్గత బీటీ రోడ్డు అడుగడుగునా మలుపులతో ప్రమాదకరంగా మారింది. 2 కిలోమీటర్లలోనే 6చోట్ల మలుపులు ఉండడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ ఈ మార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ మార్గం నుంచి మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి అనేక మంది ద్విచక్రవాహనాలు, ఆటోల్లో రాకపోకలు సాగిస్తుంటారని, ప్రైవేటు పాఠశాలల బస్సులు కూడా ఈమార్గంలో వెళ్తుంటాయని మలుపులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. మలుపులు పూర్తిగా ఏర్పడకుండా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మలుపులు ఉన్న చోట రేడియం, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో రోడ్లపై ధాన్యం ఆరబోయడం పరిపాటిగా మారిందని, దీనికితోడు మలుపులు తోడవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని పలువురు వాహనదారులు అంటున్నారు. పాలకులు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమాజ సేవకు పాటుపడాలి



రమణారెడ్డిని సన్మానిస్తున్న కార్యదర్శులు

కమలాపూర్ : ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు సమాజ సేవకు పాటుపడాలని ఎంపీడీఓ గుండె బాబు అన్నారు. కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి కొరండ్ల రమణారెడ్డి ఉద్యోగ విరమణ వీడ్కోలు సన్మాన సభ ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ బాబు, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ కరన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, ఎంపీడీఓ, గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బంది, పలువురు రాజకీయ నాయకులు, పాత్రికేయులు ఆయనను శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శిగా రమణారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఇటీవల విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో ఎంపీఓగా ఉద్యోగం సాధించిన గోపాల్‌పూర్ పంచాయతీ కార్యదర్శి భగవాన్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రమేశ్, ఈసీ కార్తీక్, కాంగ్రెస్ నాయకుడు రమేశ్‌గౌడ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు



శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి గ్రామంలోని పోచమ్మ గుడి దగ్గర ఏర్పాటు చేసిన సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పిడుగు పడింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పగిలిపోయింది. స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ చందూలాల్ ఆదివారం రాత్రి విద్యుత్ సిబ్బందితో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయించి విద్యుత్ సరఫరా చేయగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రైవేట్ కంపెనీలకు కేటాయింపు అన్యాయం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య



మాట్లాడుతున్న ఉప్పలయ్య

పరకాల : భవన నిర్మాణ కార్మిక వేల్ఫేర్ బోర్డు ద్వారా అమలు జరుగుతున్న కార్మికుల బెనిఫిట్ ఫండ్, ఇన్సూరెన్స్ స్కీములను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలకు కేటాయిస్తూ జీఓ 12ను విడుదల చేయడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య మండిపడ్డారు. యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్మికుల సహజ మరణం, ప్రమాద బీమా, పాక్షిక, శాశ్వత అంగవైకల్యం వంటి ఇన్సూరెన్స్ స్కీంలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడం వలన కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే జీ.ఓ 12ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్ల కుమారస్వామి, నాయకులు సుధాకర్, కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి మండలస్థాయి క్రీడోత్సవాలు

పరకాల : పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 9 వరకు మండల స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి రమాదేవి, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జీహెచ్‌ఎస్) వద్ద 8న అండర్ 14–17 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా ఎంపికలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా 9న అండర్ 14–17 బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం



కమలాపూర్ : మాట్లాడుతున్న శ్రీనివాస్



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న శ్రీకాంత్‌యాదవ్

కమలాపూర్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలాపూర్ మండలంలో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. మండలంలో జెడ్పీటీసీ స్థానంతో పాటు అత్యధిక ఎంపీటీసీ స్థానాలు గెలుపొంది ఎంపీపీ స్థానాన్ని, అదే విధంగా అత్యధిక సర్పంచ్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎలాంటి వర్గవిభేదాలు లేవని, గెలిచే సత్తా ఉన్న వారికి పార్టీ బీఫాంలు కేటాయిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాంబరావు, నాయకులు శోభన్‌బాబు, కోటేశ్వర్, అశోక్ రెడ్డి, సుధాకర్, ప్రవీణ్, భిక్షపతి, రాజ్‌మహ్మద్, రాంబాబు, మొగిలి, రవీందర్, సత్తయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఆయన హాజరై మాట్లాడుతూ.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మొత్తం స్థానాలను కైవసం చేసుకునే విధంగా ప్రణాళిక రూపొందించి ముందుకెళ్లాలని అన్నారు. ప్రతీ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే లబ్ధి, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. బీజేపీకి ఇవ్వండి అవకాశం అనే నినాదంతో ముందుకెళ్లాలని అన్నారు. నాయకులు చిరంజీవి, శంకరయ్య, కిష్టయ్య, శ్రీవర్ధన్, మధుకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



కమలాపూర్ : మండలంలోని గూడూరులో గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండపాక రవి, ఉపాధ్యక్షుడిగా బయగాని సురేందర్, ప్రధాన కార్యదర్శిగా పిల్లల శ్రీనివాస్, కోశాధికారిగా నర్మెట శ్రీనివాస్, డైరెక్టర్లుగా పిల్లల కరుణాకర్, జక్కు సదయ్య, బండి దేవేందర్, పిల్లల రాజు, నేరెళ్ల శ్రీనివాస్, పిల్లల రాజు ఎన్నికయ్యారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గీత కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడిగా తడక శ్రీనివాస్‌ను, ఉపాధ్యక్షుడిగా తడక సుధాకర్‌ను ఆ సంఘం సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురిని శాలువాతో సత్కరించారు. తమ నియామకానికి సహకరించిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.


డాంబర్‌ప్లాంట్‌లో వైద్యశిబిరం ఏర్పాటు



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆత్మకూరు : మండలంలోని హౌజుబుజుర్గులో గల డాంబర్‌ప్లాంట్‌లో సోమవారం ఆత్మకూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి స్పందన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధుల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నర్సింగరావు, సిబ్బంది సజీనా, హేమలత, నాంచారయ్య, దుర్గాప్రసాద్, జునేది, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి సోదరుడి మృతి



కృష్టారెడ్డి(ఫైల్)



నివాళులర్పిస్తున్న యాదగిరిరెడ్డి తదితరులు

జనగామ: జనగామ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సోదరుడు కృష్టారెడ్డి (84) సోమవారం హైదరాబాద్ మల్లాపూర్ స్వగృహంలో మృతిచెందారు. ఐనవోలు మండలం పున్నేల్‌కు చెందిన ఆయన.. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించారు. తమ్ముడు, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి సహకారంతో మూడన్నర దశాబ్దాల క్రితమే హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డారు. స్వగృహంలో గుండెపోటుతో సోదరుడు మృతి చెందారని వార్త తెలుసుకున్న ముత్తిరెడ్డి హుటాహుటిన హైదరాబాద్ చేరుకున్నారు. కృష్టారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించి, కన్నీరు మున్నీరుగా విలపించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మల్లాపూర్‌లోని వైకుంఠధామంలో అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు. ఆయన మృతి పట్ల బంధువులు, స్నేహితులు, రాజకీయ నాయకులు సంతాపం ప్రకటించారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై

వేలేరు : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై కిషన్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని పీచర ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్లు వస్తే స్పందించొద్దని అన్నారు. ఎవరైనా తెలియని వ్యకులు ఫోన్లు చేసి ఓటీపీలు, బ్యాంకు ఖాతా, ఇతర వివరాలు అడిగితే చెప్పొదన్నారు. విద్యార్థులు వారి తల్లితండ్రులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

శాయంపేట : అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి చికిత్సపొందుతున్న రైతు సోమవారం మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నాలికే అనిల్(38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోశించుకుంటున్నాడని తెలిపారు. అనిల్‌కు ఒక ఎకరం సొంత భూమి ఉండగా మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పంట సాగు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ పెట్టుబడికి అప్పులు ఎక్కువ అవడంతో ఎలా తీర్చాలో తెలియక ఈనెల 2వ తేదీన రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు, చుట్టుపక్కలవారు 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య వరలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

- సీఐ రంజిత్‌రావు



మాట్లాడుతున్న సీఐ రంజిత్‌రావు

దామెర : పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని సీఐ రంజిత్‌రావు హెచ్చరించారు. దామెర మండల కేంద్రంలో దసరా పండుగ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై, సిబ్బందిపై మద్యం తాగి అనుచితంగా వ్యవహరించిన పలువురిని సోమవారం అరెస్టు చేశారు. గ్రామానికి చెందిన దామెర ఆనందం, అతని కుమారులు శాంతిరాజ్, పృధ్వీరాజ్ దసరా పండుగ రోజున మద్యం మత్తులో పోలీస్‌ల విధులకు ఆటంకం కలిగించినట్లు చెప్పారు. దీంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. విధులకు ఆటంకం కలిగిస్తే సహించేదిలేదన్నారు. ఆయన వెంట దామెర ఎస్సై కొంక అశోక్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

దామెర : దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. సామూహిక హోమంతో పాటు, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంప్రదాయంలో దేవాలయాలు ఆధ్యాత్మికశాంతి, సామాజిక ఏకతకు ప్రతీకలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటే యువతలో ధార్మికచైతన్యం, సేవాభావం, భక్తి పెంపొందుతాయన్నారు. అనంతరం ఇండ్ల రాజు ఆధ్వర్యంలో మహాఅన్నదానం చేపట్టారు. పిట్టల రమేశ్, గొడిశల సాంబరాజు, ఇండ్ల శివ, నవీన్, అనిల్, రవి, నాగేందర్, సుమంత్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

- ఎస్సై అశోక్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అశోక్

దామెర : రౌడీషీటర్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని ఎస్సై కొంక అశోక్ హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి దినచర్య, ఇతర పనుల గురించి ఆరా తీశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గొడవలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని అన్నారు. ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. ఆయన వెంట ఏఎస్సైలు యాకయ్య, రమేశ్, సిబ్బంది, రౌడీషీటర్లు పాల్గొన్నారు.

ఓటు కోసం వస్తే నిలదీయండి



ప్రజలకు బాకీకార్డును అందజేసి మాట్లాడుతున్న నాయకులు

శాయంపేట : స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఓటు అడగడానికి వస్తే బాకీ కార్డులు చూపించి నిలదీయాలని బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలకు సూచించారు. మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ 22 నెలలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బాకీ పడిన బాకీ కార్డులను అందించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుబంధు, మహిళలకు రూ.2500, వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు పెంచలేదని, కల్యాణలక్ష్మి రూ.లక్షతో పాటు తులం బంగారం ఎవరికి ఇచ్చారో కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాలని ప్రజలకు సూచించారు. ఓటు అడగడానికి వచ్చిన నాయకులను ఇదిగో మా బాకీ కార్డు, మాకు రావాల్సిన బాకీ ఇవ్వండి అంటూ అడగాలని కోరారు.

బాకీకార్డులతో బీఆర్‌ఎస్ కొత్త నాటకం

- పీఏసీఎస్ శిలాఫలాకానికి పిండప్రదానం చేసి కాంగ్రెస్ నాయకుల నిరసన



పీఏసీఎస్ శిలాఫలాకానికి పిండప్రదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు బాకీ ఉందంటూ బాకీకార్డులు పంపిణీ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కొత్త నాటానికి తెరలేపారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ భవన నిర్మాణం కోసం గతంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి భూమి పూజ చేసిన శిలాఫలాకానికి కాంగ్రెస్ నాయకులు పిండ ప్రదానం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతూ హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ఉనికి కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. 22 నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర.. నిధులు ఉన్నప్పటికీ నిర్మాణం పూర్తిచేయలేదని ఆరోపించారు. పీఏసీఎస్‌లో మాజీ పాలకవర్గ సభ్యులు 15 లక్షల రూపాయల అవినీతికి పాల్పడి సొసైటీకి బాకీ పడితే అవి రికవరీ చేయించలేని అసమర్థ నాయకుడు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు రవీందర్, చక్రపాణి, శ్రీనివాస్‌రెడ్డి, రవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేలవాలిన వరిపంట పరిశీలన



నేలవాలిన వరిపైరును పరిశీలిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కురిసిన భారీ వర్షానికి వరిపంట నేల కొరిగింది. దీంతో సూరారం, దండేపల్లి, బావుపేట గ్రామాల్లో నేలవాలిన వరిపంటను తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, హనుమకొండ, కరీంనగర్ జిల్లాల అధ్యక్షుడు హింగె భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ వర్షానికి సుమారు వెయ్యి ఎకరాల్లో వరిపంట నేలవాలి పంటనష్టం జరిగిందన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పన నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల కోసం పంటబీమా పథకాన్ని అమలు చేయాలని అన్నారు. రైతులు రవీందర్‌రావు, లింగారావు, శ్రీపతిరావు, రాములు, రమేశ్, రాజేశ్వర్‌రావు, సమ్మయ్య, రియాజ్, సంపత్‌రావు పాల్గొన్నారు.